క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు కలెక్టర్ అభినందన



శివన్నారాయణరెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: పర్యాటక విశేషాలపై ఉత్తమ ప్రచురణ విభాగంలో ఈ ఏడాది గోదావరి పుస్తకానికి రాష్ట్ర పర్యాటక అవార్డును సాధించిన కాకినాడ జిల్లాకు చెందిన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డిని కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం నుచి పొందిన అవార్డులు, ప్రశంసా పత్రాలను కలెక్టర్‌కు చూపించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యాటకంపై రాసిన ఐదు పర్యాటక పుస్తకాలకు రాష్ట్రస్థాయిలో వరుసగా ఐదు అవార్డులు లభించడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ అన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేయాలి



సర్టిఫికెట్లతో స్కౌట్ మాస్టర్లు, గైడ్ టీచర్లు

బాలాజీచెరువు: ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖా. ధికారి పిల్లి రమేష్ అన్నారు.జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఉత్తమ గుణాలు పెంపొందించాలని, సమాజానికి ఉత్తమ పౌరులను అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం 40 మంది స్కౌట్ మాస్టర్స్, 40 మంది గైడ్ టీచర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి పీవీవీ సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ షంషాద్ బేగం, జిల్లా జాయింట్ కార్యదర్శి వి.మాచరరావు, డీవీఎస్ లక్ష్మీకుమారి, ఏటీసీలు వి.నీలిమ, కె.సుబ్రమ్మణ్యం, శ్రీహరిరాజు, రాజేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా వరహాలబాబు

కాకినాడ సిటీ: కాకినాడ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా వరహాలబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ భావనను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు రోటరీ గవర్నర్ పర్యటన

బోట్‌క్లబ్: రోటరీ గవర్నర్ ఎం వేంకటేశ్వరరావు శుక్రవారం కాకినాడలోని రోటరీ శాశ్వత ప్రాజెక్టులు పరిశీలిస్తారని క్లబ్ అధ్యక్షుడు ఎస్ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా ప్రాజెక్టులతో పాటు, రోటరాక్ట్ క్లబ్ కూడా సందర్శిస్తారన్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. స్థానిక అచ్చంపేట జంక్షన్ వద్ద ఆయనకు భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. క్లబ్ సభ్యులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

కార్పొరేషన్ ఎస్ఈగా కామేశ్వరరావు

కాకినాడ: నగరపాలక సంస్థ ఇన్‌చార్జి సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా పి.కామేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ ఈఈగా పనిచేస్తున్న ఆయనకు సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంతకాలం ఇక్కడ సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా పనిచేసిన పి.సత్యకుమారి విజయవాడకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ నుంచి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రూ.పది నాణెంపై అవగాహన

కాకినాడ సిటీ: ప్రజల్లో పది రూపాయల నాణెం చెల్లుబాటుపై ఉన్న అపోహలు తొలగించడం కోసం ఆర్‌బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంక్ నేతృత్వంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఈ నాణెం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాణెం విషయమంలో అపోహలు నమ్మవద్దని కలెక్టర్ చెప్పారు. దీనిని తిరస్కరించడం శిక్షార్హమని బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు.

సినిమాలు

ఆనంద్ సినిమాస్:	విశ్వం, వేట్టయన్, ఇద్దరు, జనక అయితే గనక
దేవి మల్టీప్లెక్స్:	ది డెవిల్, విశ్వం, దేవర, మా నాన్న సూపర్ హీరో
లక్ష్మీ:	కల్లు కాంపౌండ్
సత్యగౌరి:	లవ్ రెడ్డి
తిరుమల:	ఖడ్గం
సీఅండ్‌సీ:	జనక అయితే గనక
సీఅండ్‌సీ 2:	శ్వాగ్
పద్మప్రియ:	దేవర
శ్రీప్రియ:	మార్టిన్
సూర్య 1:	దేవర
సూర్య 2:	జనక అయితే గనక

మొక్కే అని వదిలేస్తే..

- టూటౌన్-భానుగుడి ఫ్లైఓవర్‌కు పొంచి ఉన్న ముప్పు !
- అధికారుల నిర్లక్ష్యంతో దెబ్బతింటున్న రెయిలింగ్
- రక్షణ గోడల్లో మొలుస్తున్న పిచ్చి మొక్కలు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కాకినాడ లీగల్: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. వారి నిర్లక్ష్య వైఖరితో కీలకమైన నిర్మాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఎదురవుతున్నాయి. నగరంలో ఎంతో కీలకమైన టూటౌన్ నుంచి భానుగుడి వెళ్లే ఫ్లైఓవర్‌లోని రెయిలింగ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ వంతెన రెయిలింగ్ పగుళ్ల నుంచి పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. చాలా కాలంగా ఈ ఫ్లైఓవర్‌కు నిర్వహణ కానీ, మరమ్మతులు కానీ చేయలేదు. దీంతో ఫ్లైఓవర్ దుస్థితిపై నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకూ క్షణం తీరిక లేకుండా వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. నిత్యం ఈ బ్రిడ్జిపై వాహనాల రద్దీ కొనసాగుతూనే ఉంటుంది.



ఫ్లైఓవర్ రెయిలింగ్‌పై పెరిగిన పిచ్చి మొక్కలు

వేలాది వాహనాలతో పాటు, పాదచారులు సైతం రాకపోకలు సాగిస్తుంటారు. ఇది మరమ్మతులకు గురవుతున్నా.. అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వంతెన దెబ్బతింది. వంతెన రెయిలింగ్‌కు పగుళ్లు ఏర్పడి, పిచ్చి మొక్కలు మొలిచాయని స్థానికులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జి కింద నుంచే అధిక సంఖ్యలో ప్రజలు చిన మార్కెట్‌కు, బస్టాండ్‌కు వెళ్తుంటారు. బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని, మొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికుల భయాందోళన

జిల్లా కేంద్రమైన కాకినాడకు జిల్లా నలుమూలలు నుంచి వచ్చేవారు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కలెక్టర్ సైతం ప్రతీ రోజు తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రహదారులు, భవనాల శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ మార్గంలోనే తమ కార్యాలయాలకు రాకపోకలు కొనసాగిస్తారు. అయినప్పటికీ ఒక్కరు కూడా ఈ రహదారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.



ఫ్లై ఓవర్‌పై వాహనాల రాకపోకలు



ధ్వంసమైన ఫ్లైఓవర్ రెయిలింగ్

ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 30 వేల నుంచి 40 వేల మంది తమ వాహనాలతో ప్రయాణం చేస్తుంటారు. ఇక బ్రిడ్జి కింద నుంచి కూడా 20 వేల నుంచి 30 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి బ్రిడ్జికి మరమ్మతులు చేయకపోవడం దారుణమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జి నిండా పిచ్చి మొక్కలే..

ఫ్లైఓవర్‌కున్న రెయిలింగ్‌తో పాటు, రక్షణ గోడలపై కూడా చాలా ఎక్కువగా పిచ్చి మొక్కలు పెరగడంతో రక్షణ గోడ పెచ్చుపెచ్చులుగా ఊడిపోతోంది. దీంతో రక్షణ గోడ కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. కానీ అధికారులు మాత్రం పిచ్చి మొక్కలు కూడా తొలగించలేని స్థితిలో ఉన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి



బ్రిడ్జి రెయిలింగ్ పక్కన పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. మొక్కుబడిగా ఆ మొక్కల కొమ్మలను నరికి వదిలేస్తున్నారు. దీంతో మళ్లీ చిగురించి, మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. గోడల్లో పెరిగిపోతున్న ఈ మొక్కలను వేళ్లతో సహా తొలగించి, మళ్లీ మొలవకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– జీఎస్ఆర్ కృష్ణారావు, స్థానికుడు

అధికారులు పట్టించుకోవాలి



బ్రిడ్జి రెయిలింగ్‌కు మరమ్మతులు చేయించాలి. మరమ్మతులు చేయకుండా, రంగులు వేసి మెరుగులు దిద్దారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి రెయిలింగ్ పక్కన వస్తున్న మొక్కల తొలగింపునకు శాశ్వత చర్యలు చేపట్టాలి.

– ఎస్‌వీ వెంకటరమణ, స్థానికుడు

పోలీసు స్టేషన్ నిర్వహణపై ఎస్పీ అసంతృప్తి

కరప: పోలీసుస్టేషన్ భవనం పెచ్చులూడి, నీరు కారడం, పరిసరాల అపరిశుభ్రతపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కరప పోలీసుస్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించి, స్టేషన్ పరిసరాలు, రికార్డురూమ్, ఆయుధాలు భద్రపరచే గది, కంప్యూటర్ రూమ్, ఖైదీలను ఉంచే సెల్ పరిశీలించారు. అక్కడి సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. భవనం శ్లాబు పెచ్చులూడిపోవడం, వర్షపు నీరు లీకవ్వడం, భవనం పైకి ఎక్కేందుకు మెట్లు లేకపోవడం, కనీసం నిచ్చెన కూడా ఏర్పాటు చేయకపోవడంపై సిబ్బందిని నిలదీశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని, సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఆయన వెంట కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, ఎస్సై టి.సునీత, అదనపు ఎస్సై మూర్తి ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పేదలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: ప్రపంచ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక రమణయ్యపేటలో పేదలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనకు పొదుపు దోహదం చేస్తుందన్నారు. సంపాదనలో కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవాలన్నారు. మనిషి మనుగడకు తిండి, గూడు, గుడ్డ అవసరమన్నారు. ఆధ్యాత్మిక వేత్త శిరీష, సభ్యులు రాఘవరావు, రిటైర్డ్ తహసీల్దార్ బాపిరాజు పాల్గొన్నారు.



ఎల్‌బీ నగర్‌లో జలమయమైన ప్రధాన రహదారి



వర్షం నీటిలో మునిగిన శాంతినగర్-సాంబమూర్తినగర్ ప్రధాన రోడ్డు

దంచి కొట్టిన వాన

- రహదారులు జలమయం
- అవస్థలు పడ్డ ప్రజలు

బోట్‌క్లబ్: నగరంలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కారణంగా పలు రహదారులు జలమయమయ్యాయి. ఏ వీధిలో చూసినా వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తూ కనిపించింది. డ్రైనేజీలన్నీపొంగి పొర్లాయి. ఉదయం స్కూళ్లు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు వర్షంలో అవస్థలు పడాల్సి వచ్చింది. స్థానిక శాంతినగర్ నుంచి సాంబమూర్తినగర్ వెళ్లే రహదారులు పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు అగచాట్లు పడ్డారు. వర్షం వస్తే ఈ రహదారులపై ఎలా ప్రయాణించేదని విద్యార్థులు, వారి తల్లితండ్రులు ప్రశ్నిస్తున్నారు. ముంపు నీరు డ్రైనేజీల్లోకి వెళ్లే విధంగా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగించాలని కోరుతున్నారు. వర్షపు నీరు కారణంగా స్థానిక ఎల్‌బీనగర్, విద్యుత్‌నగర్, సినిమా రోడ్డు, గాంధీనగర్, రామారావుపేట, జగన్నాథపురం, మెయిన్‌రోడ్డుతో పాటు, అనేక ప్రాంతాల్లోని రహదారులు వర్షపు నీటిలో సెలయేరుగా తయారయ్యాయి. దీంతో రోడ్డుపై ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పలేదు. స్థానిక ఎల్‌బీనగర్ నుంచి కొండయ్యపాలెం బ్రిడ్జివైపు వెళ్లే రహదారికి అప్రోచ్ పనులు సగంలో వదిలివేయడంతో ఈ రోడ్డు బురదమయంగా మారింది. దీంతో వర్షం వస్తే ఈ రహదారిపై పాట్లు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వీలైనంత త్వరగా ఈ రహదారి పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి

కలెక్టర్ షణ్మోహన్ నివాళి

కాకినాడ సిటీ: భారత ఇతిహాసాలకు సంబంధించి ఆదికావ్యంగా చెప్పుకొనే రామాయణ గ్రంథాన్ని ఈ సమాజానికి అందించిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి అని కలెక్టర్ షణ్మోహన్ కొనియాడారు. ఆదికవి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, బీసీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి చిరకాలం తపస్సు ఫలితంగా స్వయం మహర్షి అయ్యారన్నారు. రామాయణం వంటి మహాకావ్యాన్ని ఈ సమాజానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి ఆదికవి వాల్మీకి అని కొనియాడారు. బోయవాడైనా ఓ సాధారణ మనిషి మహారుషిగా మారి, రామాయణం వంటి దివ్యమైన గ్రంథాన్ని రచించడం గొప్ప విశేషమన్నారు. మహర్షి వాల్మీకి జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా పెద్దాపురానికి చెందిన రచయిత్రి, గాయని బి నాగమణి.. విశిష్ట వాల్మీకి, మహర్షికి వందనం అంటూ పాడిన పాట ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి తిప్పేనాయక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారులు ఎం సుబ్బారావు, ఎన్ రాజేశ్వరి, బీసీ సంక్షేమ సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

ఆదర్శ కావ్యం రామాయణం

బాలాజీచెరువు: మహాకవి వాల్మీకి జయంతి వేడుకలు ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన ఆదర్శ కావ్యం రామాయణమన్నారు. ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ సంస్కృత సాహిత్యంలో మొదటి పురాణ గాథను రచించడం వల్ల వాల్మీకి ఆదికవి బిరుదు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీకాంత్ పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు శ్రీకృష్ణదేవరాయలు

కాకినాడ రూరల్: పిన్న వయసులోనే విజయనగర సింహాసనాన్ని అధిష్టించిన శ్రీకృష్ణదేవరాయలు గొప్ప రాజనీతిజ్ఞుడని, దక్షిణ భారతదేశమంతా రాజ్యమేలారని రిటైర్డ్ ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు 495వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి ఆయనతో పాటు, ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ఎస్.శ్రీనగేష్, రెడ్నం రాజా తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, శ్రీకృష్ణదేవరాయలు పాలనలో విజయనగర సామ్రాజ్యం వివిధ రంగాల్లో అత్యున్నత స్థితికి చేరిందన్నారు. భారత దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తుల్లో దేవరాయలు ప్రముఖులని కొనియాడారు. 1529 అక్టోబర్ 17న ఆయన కాలం చేశారని తెలిపారు.



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘు సభ్యులు

తెలుగు గౌరవాన్ని చాటిన శ్రీకృష్ణదేవరాయలు

బోట్‌క్లబ్: దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పిన మగధీరుడు శ్రీకృష్ణదేవరాయలు అని వైఎస్సార్ సీపీ నాయకుడు కురసాల సత్యనారాయణ అన్నారు. ఆంధ్రా కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి నిర్వహించారు. కాపు జాతికి వన్నె తెచ్చిన మహారాజు అని కొనియాడారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘు గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, సంఘు సభ్యులు పాల్గొన్నారు.



రమణయ్యపేటలో శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

- శబరిమల, పంచారామాలకు సర్వీసులు
- ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ వెల్లడి

కాకినాడ: పంచారామక్షేత్రాలు, శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సుల సదుపాయాన్ని కల్పించనున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆయన గురువారం విడుదల చేశారు. అయ్యప్ప యాత్రకు వెళ్లే భక్తులకు ఆడియో, వీడియో, పుష్ బ్యాక్ సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవసరమైన భక్తులు తమను సంప్రదించవచ్చని సూచించారు. నాలుగు రోజులలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్ని, శబరిమలను దర్శించి వచ్చేందుకు రూ.5 వేలు చార్జీగా నిర్ణయించామన్నారు. అలాగే శ్రీ శైలం, మహానంది, శ్రీపురం, అరుణాచలం, శబరిమలై, ఫలణి, కాణిపాకం, తిరుపతి, విజయవాడ దర్శనాలను ఏడు రోజులలో పూర్తి చేసి వచ్చేందుకు రూ.5,850గా నిర్ణయించామని వివరించారు. అలాగే 11 రోజుల యాత్రకు రూ.8,700గా నిర్ణయించామన్నారు. అలాగే కార్తిక మాసంలో ఒకే రోజు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట పంచారామ క్షేత్రాలను దర్శించేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 2, 3, 9, 10, 16, 17, 23, 24, 30, డిసెంబర్ 1 తేదీలలో కాకినాడ నుంచి బస్సులు బయలుదేరతాయన్నారు. ప్రతి శని, ఆదివారాలు రాత్రి 8 గంటలకు కాకినాడలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 8 గంటలకు తిరిగి కాకినాడ చేరుకుంటాయన్నారు. పంచారామాల యాత్రకు ఎక్స్‌ప్రెస్‌కు రూ.910, అల్ట్రా డీలక్స్ రూ.1,120, సూపర్ డీలక్స్ బస్సులకు రూ.1,160గా చార్జీలు నిర్ణయించినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏక మొత్తంగా అద్దె ప్రాతిపదికన కూడా బస్సులు ఇస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎం మనోహర్

ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కరప: వివిధ అథ్లెటిక్స్ విభాగాలలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీలలో వేళంగి మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం జి.భారతి గురువారం తెలిపారు. కాకినాడ రూరల్ ఆటలు, అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చూపి దుర్గాప్రసాద్, రాంబాబు, వీరమణికంఠ స్వామి, భగవాన్ అభిరామ్, మనీషా, వీరేంద్ర, ప్రవీణ్‌జోష్, వీరదుర్గ, సాయి రితిక, వరలక్ష్మి, లక్ష్మీదీప్తి, సాయిసుధ ఎంపికైనట్టు చెప్పారు. వీరు ఈ నెల 24 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. ఎంపికైన క్రీడాకారులను, తర్ఫీదునిచ్చిన పీడీ సీహెచ్ కృష్ణను సర్పంచ్ ఎస్.నీలిమ, స్కూల్ డెవలప్‌మెంట్ చైర్మన్ మెర్ల వీరయ్యచౌదరి, లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు, , హెచ్ఎం భారతి తదితరులు అభినందనలు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు



కాకినాడ కుంభాభిషేకం వద్ద గురువారం ఉదయం 5.58కి భానోదయం



కొద్దిసేపటికే తుపాను ప్రభావంతో కురుస్తున్న కుంభవృష్టి

భానువరుణుల దోబూచులాట

సాగర తీరాన అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. కొన్ని క్షణాలే కనులకు సాక్షాత్కరించిన ఆ ప్రకృతి రమణీయ చిత్రం చూపరులను అబ్బురపరిచింది. కాకినాడ కుంభాభిషేకం వద్ద గురువారం వేకువజామున కారు మబ్బులను చీల్చుకుంటూ భానోదయమైంది. కొద్ది సేపటికే తుపాను ప్రభావంతో ఆకాశమంతా ఆక్రమించిన మేఘాలు వర్షించడం మొదలయ్యాయి. సకల జీవకోటికి వెలుగులిచ్చే భానుడు అదృశ్యమై, చీకట్లు కమ్ముకున్నట్టు వాతావరణం ఆకస్మికంగా మారిపోయింది. వరుణుడి కుంభవృష్టితో ఆ ప్రాంతమంతా తడిసిముద్దయింది. ఈ ప్రకృతి హఠాత్పరిణామానికి అక్కడున్న వారు విస్మయం చెందారు.

– కాకినాడ రూరల్